సాక్షి
మహబూబాబాద్
మంగళవారం | 7 | జనవరి | 2025



కీరా..ఔరా
కీరదోస..రైతుల ఇంటా సిరులు కురిపిస్తోంది. నీటి వినియోగం తక్కువ..లాభాలు ఎక్కువగా ఉండటంతో అధికంగా సాగు చేస్తున్నారు.
- 8లో▸



రామప్ప అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
రామప్పలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని స్మితా సబర్వాల్ ఆదేశించారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0^0/14.3^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రివేళ చలితోపాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

విద్యార్థినులకు కరాటేలో గోల్డ్‌మెడల్



బయ్యారం: మండలంలోని ఉప్పలపాడు ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఓపెన్ నేషనల్ కరాటే పోటీలో గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ నెల 5న ఖమ్మంలో జరిగిన పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థినులు రక్షిత, మానస, దీక్ష, కావేరి ప్రతిభ కనపర్చి గోల్డ్‌మెడల్ పొందారు. కాగా విద్యార్థినులను సోమవారం పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఉప్పలయ్య, చారి, కరాటే కోచ్ విజయనిర్మల అభినందించారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

నెల్లికుదురు(నెహ్రూసెంటర్): అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు (మంగళవారం) చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిర్ర లక్ష్మీనర్సమ్మ, ఎల్లారీశ్వరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతన హామీని అమలు చేయాలని,ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని,పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అంగన్‌వాడీలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

తలనీలాలకు రూ.31.50లక్షలు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన వేలంపాటలో తలనీలాలను రూ.31.50లక్షలకు హైదరాబాద్‌కు చెందిన నవీన్ దక్కించుకున్నట్లు ఆలయ ఈఓ సత్య నారాయణ తెలిపారు. వేలంపాటలు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత సమక్షంలో నిర్వహించారు. అలాగే తూర్పు ద్వారం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో పూజా సామగ్రి అమ్ముకునేందుకు నిర్వహించిన వేలంలో కురవికి చెందిన నిలుగొండ రాజు రూ.85వేలకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్‌గౌడ్, చిన్నం గణేష్, భిక్షపతి, రజిత, జనార్దన్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిట్‌తో బీఐఎస్ ఒప్పందం



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌తో బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) సోమవారం పరస్పర ఒప్పందం కుదుర్చుకుంది. బీఐఎస్ 78వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేంద్ర వినియోగదారుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో వరంగల్ నుంచి నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ ఆన్‌లైన్‌లో ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో వినియోగదారుల మంత్రిత్వశాఖ కార్యదర్శి నిధి ఖారే, బీఐఎస్ డీజీ ప్రమోద్ కుమార్ తివారి, హైదరాబాద్ శాఖ డైరెక్టర్ పీవీ. శ్రీకాంత్, నిట్ ప్రొఫెసర్లు శ్రీనివాసచార్య, రతిష్ కుమార్, వేణు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

25నుంచి పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పీజీ కోర్సుల (నాన్ ప్రొఫెషనల్) మూడో సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 25వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్‌ఎల్ సౌజన్య సోమవారం తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్‌ఆర్‌ఎం తదితర పీజీ కోర్సుల మూడో సెమిస్టర్ పరీక్షల టైంటేబుల్‌ను విడుదల చేశారు. ఈ పరీక్షలు ఈనెల 25, 27, 29, 31, ఫిబ్రవరి 3, 5 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

అల్పాహారం పెట్టండి

పస్తులతో ప్రత్యేక తరగతులకు టెన్త్‌క్లాస్ విద్యార్థులు
- ఉదయం 8 గంటలకే పాఠశాలలకు చేరిక
- మధ్యాహ్నం భోజనం వరకు ఎదురుచూపు
- నిధుల మంజూరుపై చేతులెత్తేసిన ప్రభుత్వం
- దాతల సహకారం కోసం ప్రయత్నాలు



చిన్నగూడూరు ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక తరగతుల నిర్వహణ

సాక్షి, మహబూబాబాద్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం గంట చొప్పున అదనంగా క్లాసులు నిర్వహిస్తున్నారు. అయితే ఉదయం ఇంటి వద్ద అన్నం, కూర తయారు కాకపోవడంతో ఖాళీ కడుపుతో తరగతులకు హాజరయ్యే విద్యార్థులు మధ్యాహ్న భోజనం వరకు వేచి ఉండాల్సి వస్తుంది. కాగా, దాతలు ముందుకు వస్తేనే అల్పాహారం పెట్టే అవకాశం ఉంది.

పస్తులతో ప్రత్యేక తరగతులకు..
ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు పస్తులతో ప్రత్యేక తరగతులకు హాజరుకావాల్సి వస్తోంది. మెరుగైన మార్కులు సాధించేందుకు ఉదయం 8నుంచి 9గంటల వరకు, సాయంత్రం 4:15నుంచి 5:15 గంటల వరకు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. అంటే విద్యార్థి ఉదయం 7గంటలకే ఇంటి నుంచే పాఠశాలకు బయటు దేరాలి. అప్పటికి ఇంటి వద్ద అన్నం, కూర తయారు కాదు దీంతో స్నానం చేసి తయారై ఖాళీ కడుపుతో బడికి వస్తాడు. అప్పటి నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు భోజనం కోసం ఎదురుచూడాల్సిందే. తిరిగి సాయంత్రం 6 గంటలు దాటితేనే ఇంటికి వెళ్లి ఏమైనా తినాల్సి ఉంటుంది.



దాతల కోసం..
గతంలో పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం స్నాక్స్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ ఏడాది అల్పాహారం నిధుల ఊసేలేదు. దీంతో దాతల సహకారంతో స్నాక్స్ పెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయులకు చెబుతున్నారు. అయితే పిల్లలు స్నాక్స్ పెట్టేందుకు ఏ దాత వస్తాడో.. ఎవరి వద్దకు వెళ్లి స్నాక్స్ పెట్టమని అడగాలో అనే ఆలోచనలో ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ ఏడాది 8,192 మంది పదో తరగతి పరీక్షలు హాజరయ్యేందుకు సిద్ధం అవుతుండగా.. ఇందులో 6,343 మంది అన్ని విభాగాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. ఇందులో గురుకులాలు, కేజీబీవీలు మినహా 2,932 మంది లోకల్ బాడీ, 134 మంది ప్రభుత్వ, 735 మంది మోడల్ స్కూళ్లలో చదివే విద్యార్థులు ఉన్నారు. మొత్తం 3,801 మంది విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం అందితేనే చదువులు ముందుకు సాగుతాయి. అయితే ఇందులో 20 పాఠశాలల్లో స్థానిక పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయుల బృందం సహకారంతో అల్పాహారం పెడుతున్నారు. మిగిలిన పాఠశాలల్లో మాత్రం విద్యార్థులు అర్ధాకలితో చదువులు సాగిస్తున్నారు.

అన్నం తినకుండా బడికిపోతున్నాడు



నా కొడుకు ఉదయ్ కుమార్ బయ్యారం గవర్నమెంట్ బడిలో పదో తరగతి చదువుతున్నాడు. ఉదయం ఎనిమిది గంటలకే క్లాసులు ఉన్నాయని ఏడు గంటలకే ఇంటి నుంచి వెళ్తున్నాడు. అప్పటి వరకు అన్నం, కూర కావడం లేదు. దీంతో ఏం తినకుండానే బడికి వెళ్తున్నాడు. అక్కడ స్నాక్స్ పెట్టేలా చూడండి.

– జంపాల శ్రీను, వెంకటరాంపురం, బయ్యారం

ఆకలితో మధ్యాహ్నం వరకు ఆగాలి



నేను ప్రతీరోజు మా ఊరు అమీనాపురం గ్రామం నుంచి ఉదయం 8 గంటలకు ఆటోలో కేసముద్రంలోని బడికి వెళ్తాను. ఇంట్లో ఒక్క టీ మాత్రమే తాగి వెళ్లడం వల్ల ఆకలి వేస్తుంది. ఆకలి అయినా.. మధ్యాహ్నం భోజనం పెట్టే వరకు ఎదురు చూడాల్సిందే. ఉదయం, సాయంత్రం స్నాక్స్ పెడితే బాగుండు. ఉదయం ఇంటికాడ అన్నం కాదు.. మధ్యాహ్నం వరకు బడిలో అన్నం పెట్టరు. ఇబ్బందిగా ఉంటుంది.

– యార సాత్విక్, విద్యార్థి, అమీనాపురం, కేసముద్రం

దాతలు ముందుకు రావాలి



మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉదయం, సాయంత్రం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధిస్తున్నాం. దీంతో విద్యార్థులు ఉదయమే పాఠశాలకు రావాల్సి వస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని పలు పాఠశాలల్లో స్థానిక పెద్దలు, ఉపాధ్యాయుల సహకారంతో అల్పాహారం పెడుతున్నాం. మిగిలిన పఠశాలల్లో స్నాక్స్ ఇచ్చేందుకు దాతలు ముందుకు రావాలని కోరుతున్నాం.

– రవీందర్ రెడ్డి, డీఈఓ

మాది చేతల ప్రభుత్వం



ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య తదితరులు

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు పంచుతాం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఆర్టీసీని అభివృద్ధిలోకి తెచ్చాం : మంత్రి పొన్నం ప్రభాకర్
- హనుమకొండలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభం



ఎలక్ట్రిక్ బస్సులో ప్రయాణిస్తున్న మంత్రులు పొంగులేటి, పొన్నం, సురేఖ, ఎంపీ కావ్య తదితరులు

నయీంనగర్: తమది చేతల ప్రభుత్వమని, మోసం చేసి దోచుకుని మాయమాటలు చెప్పేది కాదని, రానున్న నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు నిర్మించి పేదలకు పంచుతామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మొదటి సంవత్సరం 4.5 లక్షల ఇళ్లు ఇస్తామని చెప్పారు. సోమవారం హనుమకొండ 'కుడా' మైదానంలో టీజీఆర్‌టీసీ వరంగల్ రీజియన్‌కు చెందిన 50 ఎలక్ట్రిక్ బస్సులను మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి పొంగులేటి ప్రారంభించారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రజలకు మంచి చేసినా ఓర్వలేక విమర్శిస్తున్నారని, 2014 ముందు కాంగ్రెస్ హయాంలో 25లక్షల ఇళ్లు నిర్మించామని గుర్తుచేశారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదల ఆశల మేరకు చేస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్టీసీని దండగగా మార్చే ప్రయత్నం చేయగా.. తమ ప్రభుత్వం పండుగ వాతావరణంలోకి తెచ్చిందన్నారు. పర్యావరణ హితమైన 1,000 ఎలక్ట్రిక్ బస్‌లను కొనుగోలు చేసిన ప్రభుత్వం వరంగల్ రీజియన్‌కు 112 కేటాయించిందని, తొలివిడతలో 50 బస్‌లు ఇవ్వగా సంక్రాంతి పండుగకు మరో 30 వస్తాయన్నారు. ఎలక్ట్రిక్ బస్‌లు జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు నడుస్తాయని తెలిపారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రతిపక్షాలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కనపడుతున్నా విధి లేక విమర్శలు చేస్తున్నాయని, దీనిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

ఊబర్‌ను తీసుకొచ్చి ఆటో వాళ్లకు అన్యాయం చేసింది కేటీఆర్ అన్నారు.కార్యక్రమానికి ముందు వేదికపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఫొటో లేకపోవడంతో గమనించిన అధికారులు ఆయన ఫొటో అతికించారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్య శారద, ప్రావీణ్య, గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రైతులను మోసంచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



రాస్తారోకోలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్
- బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో

కేసముద్రం: మాయమాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసంచేసిందని మానుకోట మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. రైతుభరోసా రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఎదుట ప్రధాన రహదారిపై బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా కింద రూ.15వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు రూ.12వేలు ఇస్తామంటూ రైతులను మోసం చేసిందన్నారు. అదే విధంగా రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయలేదన్నారు. గిరిజన, దళిత రైతుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వారికే అన్యాయం చేస్తుందని విమర్శించారు. లగచర్లలో గిరిజన రైతులపై పెట్టిన కేసులను వెంటనే కొట్టివేయాలన్నారు. రైతుభరోసా రూ.15వేలతోపాటు, ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు రాష్ట్ర ప్రభుత్వం వెంట పడతామని, తెలంగాణ ప్రజలకు తాము అండగా నిలిచి పోరాడుతామని పేర్కొన్నారు. కేసముద్రం పీఏసీఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎండి.నజీర్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్, జాటోత్ హరీశ్‌నాయక్, మోడెం రవీందర్‌గౌడ్, ఊకంటి యాకూబ్‌రెడ్డి, గుంజపాడుగు కొమ్మన్న, కొమ్ము రాహుల్, సట్ల వెంకన్న, దుబాకుల వెంకన్న, దార్ల రామ్మూర్తి, శ్రీధర్, రఫీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓరుగల్లు ఓటర్లు @30.43 లక్షలు


పురుషులకన్నా మహిళలే అధికం
- మార్పులు, చేర్పుల అనంతరం తుది జాబితా
- విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- 12 నియోజకవర్గాల్లో పెరిగిన ఓటర్లు
- తొలగించినవి 9,241.. చేర్చినవి 17,882

సాక్షి ప్రతినిధి, వరంగల్ : ఉమ్మడి వరంగల్‌లో ఓటర్ల సంఖ్య 30,43,540లకు చేరింది. పురుషులు, మహిళలు, ఇతరులు, సర్వీసు ఓటర్లు కలిపితే 30.44 లక్షలకు చేరగా.. సోమవారం ప్రకటించిన తుది జాబితాలో ఈసారీ మహిళలదే అగ్రస్థానం. 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పురుషులతో పోలిస్తే మహిళ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. మొత్తం 30,43,540 మంది ఓటర్లు ఉంటే, అందులో పరుషులు 14,89,606 కాగా, మహిళ ఓటర్లు 15,51,289 ఉన్నారు. ఇతరు(థర్డ్‌జండర్)లు 504 కాగా, సర్వీసు ఓటర్లు 2141. కొత్తగా నమోదైన మహిళ ఓటర్లు.. పురుషులతో పోలిస్తే 61,683 మంది ఎక్కువగా ఉన్నారు.

కూడికలు..తీసివేతలు..
ఎన్నికల సంఘం ఏటా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం కింద మార్పులు, చేర్పులతో ఓటరు జాబితాను తయారు చేస్తూ ఉంటుంది. కిందటేడాది అక్టోబరు 29న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. సవరణలు, మార్పులు, చేర్పులకు కిందటి డిసెంబర్ 31వ తేదీ వరకు అవకాశం ఇచ్చింది. అభ్యంతరాల అనంతరం సోమవారం తుది జాబితాను విడుదల చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లా 12 నియోజకవర్గాల పరిధిలో 9,241 ఓటర్లను తొలగించి, కొత్తగా 11,882 మంది ఓటర్లను చేర్చుకున్నట్లు ఈ జాబితాలో వెల్లడించారు. ఇదిలా వుండగా గతేడాదితో పోలిస్తే 62,190 మంది ఓటర్లు పెరగగా.. అక్టోబర్ 29న ప్రకటించిన ముసాయిదా, తుది ఓటర్ల జాబితాకు 10,782 మంది పెరిగారు. రెండు నెలల వ్యవధిలో 10,782 మంది కొత్త ఓటర్లు తమ ఓటుహక్కును నమోదు చేసుకోవడం విస్తృత ప్రచారమే కారణమని ఎన్నికల సంఘం ప్రకటించింది.



ఉమ్మడి జిల్లాలో ఓటర్లు ఇలా..



పోలింగ్ స్టేషన్లు
3,318
ఇతరులు
504
సర్వీస్ ఓటర్లు
2,141

అసెంబ్లీ నియోజవర్గాల వారీగా మార్పులు, చేర్పుల అనంతరం ఎన్నికల సంఘం వెలువడిన తుది జాబితా వివరాలు ఇలా...

నియోజకవర్గం	పురుషులు ఓటర్లు	మహిళ ఓటర్లు	ఇతరులు ఓటర్లు	సర్వీస్	మొత్తం
వరంగల్ పశ్చిమ	1,40,100	1,45,061	16	74	2,85,251
వరంగల్ తూర్పు	1,26,066	1,33,338	341	90	2,59,835
వర్ధన్నపేట	1,35,061	1,40,664	18	184	2,75,927
భూపాలపల్లి	1,36,952	1,41,022	08	203	2,78,185
ములుగు	1,14,504	1,20,730	26	226	2,35,486
జనగామ	1,20,891	1,25,069	10	136	2,46,106
స్టేషన్‌ఘన్‌పూర్	1,26,630	1,30,723	04	173	2,57,530
పాలకుర్తి	1,27,758	1,30,543	14	155	2,58,470
డోర్నకల్	1,10,016	1,14,627	07	183	2,24,833
మహబూబాబాద్	1,27,527	1,33,088	47	197	2,60,859
నర్సంపేట	1,15,838	1,21,487	11	355	2,37,691
పరకాల	1,08,263	1,14,937	02	165	2,23,367

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కొత్తగా చేరిన, తొలగించిన ఓటర్ల వివరాలు...

నియోజకవర్గం	చేరిన..	తొలగిన
వరంగల్ పశ్చిమ	1,059	381
వరంగల్ తూర్పు	1,040	430
వర్ధన్నపేట	1,328	777
భూపాలపల్లి	1,378	831
ములుగు	1,488	852
జనగామ	1,403	277
స్టేషన్‌ఘన్‌పూర్	1,865	396
పాలకుర్తి	1,509	444
డోర్నకల్	1,406	1,001
మహబూబాబాద్	2,786	2,201
నర్సంపేట	1,409	885
పరకాల	1,211	766
మొత్తం	17,882	9,241

జిల్లాల వారీగా పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల వివరాలు

జిల్లా	పోలింగ్‌స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం	సర్వీస్‌ఓటర్లు	మొత్తం
జనగామ	865	3,75,279	3,86,335	28	7,61,642	464	7,62,106
మహబూబాబాద్	555	2,37,543	2,47,715	54	4,85,312	380	4,85,692
వరంగల్	795	3,76,965	3,95,489	370	7,72,824	629	7,73,453
హనుమకొండ	483	2,48,363	2,59,998	18	5,08,379	239	5,08,618
జేఎస్ భూపాలపల్లి	317	1,36,952	1,41,022	8	2,77,982	203	2,78,185
ములుగు	303	1,14,504	1,20,730	26	2,35,260	226	2,35,486



వినతులు వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్

మహబూబాబాద్: ప్రజావాణిలో ఇచ్చిన వినతుల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్ వినతులను కూడా వెంటనే పరిష్కరించాలన్నారు. పరిష్కారం సాధ్యం కాకపోతే కారణాలతో కూడిన నివేదిక అందజేయాలన్నారు. సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం అనే విషయాన్ని అధికారులు గుర్తుపెట్టుకోవాలన్నారు. ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా వినతులు పరిష్కరించి వారికి నమ్మకం కలిగించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీయాలి
విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్‌ఫెయిర్ లాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన విద్యార్థులు సోమవారం కలెక్టర్ కార్యాలయం నుంచి బస్సులో బయలుదేరగా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఈనెల 6నుంచి 9వరకు జరిగే రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు జిల్లా నుంచి విద్యార్థులు వెళ్తున్నారని చెప్పారు. గైడ్ టీచర్లు, విద్యార్థులు కలిసి 37 మంది వెళ్తున్నారని చెప్పారు. రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్‌రెడ్డి, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, సంకా బద్రినారాయణ, లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన..
కురవి: మండల కేంద్రంతోపాటు అయ్యగారిపల్లి గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. పలువురి ఇళ్లకు వెళ్లి సర్వే చేస్తున్న అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన షెడ్యూల్ ప్రకారం సర్వే నిర్వహిస్తున్నామని, ఎలాంటి పొరపాట్లు లేకుండా డాటా ఎంట్రీ చేస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సునీల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థినులపై అసభ్యకర ప్రవర్తనపై విచారణ



విచారణ చేపడుతున్న తహసీల్దార్, ఎంఈఓ

కాటారం : మహాముత్తారం మండలం దొబ్బల పాడు మోడల్ పాఠశాల విద్యార్థినుల పట్ల పీఈటీ అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ సంజీవ్‌రెడ్డి విచారణ చేపట్టారు. గత డిసెంబర్ 26న పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులను సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల కోసం పీఈటీ హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. సదరు పీఈటీ మరో పీఈటీతో కలిసి మద్యం తాగి విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో విద్యార్థినులు 29వ తేదీన ఇంటికి చేరుకొని తల్లిదండ్రులకు విషయం వివరించి ప్రిన్సిపాల్ భూక్య రవికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ప్రిన్సిపాల్ సదరు పీఈటీకి షోకాజ్ నోటీస్ జారీచేయడంతో పాటు ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినులతో విడివిడిగా మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. విచారణ వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నర్సింహులపేట: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన నర్సింహులపేటలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎరనాగి సీతారాములు సోమవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. ఈ సమయంలో దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి సుమారు రూ.10 లక్షలకు పైగా నగదు, వెండి, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడి కుమారుడు రవి పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661

LITTLE STARS SCHOOL (E/M)
Vill: PEECHARA, Mdl: Velair, Dist: Hanumakonda
WANTED TEACHERS
Wanted Trained PRE-PRIMARY And PRIMARY (All Subjects)Teachers Educated in English Medium.
GARDENER to look after garden, Show plants, Vegetables etc.
Send Handwritten Resume to
Mob. 9833277626 (W App) (Please Don't Call)

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
అమ్మకానికి కలదు
■ Restaurant/ హోటల్ అమ్మకానికి కలదు కిట్స్ కాలేజ్ ప్రక్కన, ఎర్రగట్టు గుట్ట, సంప్రదించవలసిన ఫోన్ నెం: 9281474365. [W-1264116]

SERVICES
■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. సిబిల్ అవసరం లేదు. సంప్ర:: 8341479342. [WA-7551]
■ కంపెనీ అన్ని రకాల వ్యాపార, ప్రాజెక్ట్‌ల, వ్యక్తిగత, వ్యవసాయ, విద్య రుణాల సలహాలకు సంప్రదించండి DMA స్వాగతం. జీతం + కమీషన్ ✆ 9671637906. [T-297]

CHANGE OF NAME
■ We VADLAKONDA VINESH KUMAR and VALLALA SWATHI parents of VADLAKONDA SAATVIKA Resident of naimnagar Hanamkonda, I have changed my minor daughter's name from VADLAKONDA SAATVIKA GOUD (old name) to VADLAKONDA SAATVIKA (new name) for all future purposes. [W-1237386]
■ We VADLAKONDA VINESH KUMAR and VALLALA SWATHI parents of VADLAKONDA SAANVIKA Resident of naimnagar Hanamkonda, I have changed my minor daughter's name from VADLAKONDA SAANVIKA GOUD (old name) to VADLAKONDA SAANVIKA (new name) for all future purposes. [W-1237385]
■ I, the undersigned MOHAMMAD SUBHAN ALI (New name) previously called MEER SUBHAN ALI (Old Name), S/o. Mohammad Liyakhat Ali, R/o. H.No.11-2-20/1, Labour Colony, Warangal District, Telangana - 506013 solemnly declare. [W-1264179]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

BUSINESS SERVICES
■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694. [SCA25001023]

WANTED
■ డోర్ to డోర్ మార్కెటింగ్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. వయసు: 30 సం॥లోపు వారు చదువు అవసరం లేదు. జీతం: 15000. సెల్: 9849316058 [W-1264178]
■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256025]
■ హరేకృష్ణ హోం కేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K. Ph: 9640468899, 9640258899 [SCA25001049]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కీరదోస.. రైతుల ఇంటా సిరులు కురిపిస్తోంది. నీటి వినియోగం తక్కువ.. పైగా స్వల్ప కాలంలోనే చేతికొచ్చి అన్నదాతలకు అధిక లాభాలు తెచ్చిపెడుతోంది. ప్రస్తుతం రైతులు సంప్రదాయ సాగుకు కొంత మేరకు స్వస్తి చెబుతూ కొత్త పంటల వైపు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా మార్కెట్‌లో ధర ఉండడం తోపాటు స్వల్ప కాలపరిమితి గల కీరదోస పంట సాగు చేపడుతూ అధిక లాభాలు గడిస్తున్నారు. ఈ రైతుల ఆదాయ వనరులు పెరుగుతుండడంతో మరి కొందరు అన్నదాతలు కూడా ఈ పంట సాగు పట్ల మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలో కీరదోస పంట లాభాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

- ఎల్కతుర్తి



ఎల్కతుర్తి శివారులో సాగు చేసిన కీరదోస పంట

కీర.. ఔరా

ఎల్కతుర్తిలో 5 ఎకరాల్లో సాగు..

కేవలం రెండు నెలల పంట..

సిరుల పంట కీరదోస..
- కేవలం రెండు నెలల్లోపే చేతికి..
- ఎల్కతుర్తిలో 5 ఎకరాల్లో సాగు
- ఏడాదిలో నాలుగు సార్లు సాగుకు అవకాశం
- అన్నదాతల ఆసక్తి

కీరదోస.. స్వల్ప కాలపరిమితి గల పంట. కేవలం రెండు నెలల్లోపే పంట మార్కెట్‌కు తరలించేంతగా ఎదుగుతుంది. తక్కువ నీరు వినియోగించుకుని ఎక్కువ లాభా లు ఇచ్చే పంటగా కీరదోస అన్నదాతలను ఆకర్షిస్తోంది. రోహిణి కార్తెలో వేయాల్సిన పంట ఈ దఫా ముందుగానే అంటే డిసెంబర్ చివరి నుంచి సాగు చేశారు. జనవరి, ఫిబ్రవరిలో పంట కాలం ముగుస్తుంది. నీటి సౌకర్యాన్ని బట్టి పంట ఎదుగుదల ఉంటుంది. పంట సాగు కోసం పెద్దగా శ్రమించాల్సిన పని ఉండదు. విత్తనాలు వేసినప్పటి నుంచి మొలకెత్తి తీగ పారే వరకూ పురుగు మందుల వినియోగం చాలా తక్కువ ఉంటుంది. ఎకరాకు సుమారు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. రోజు తప్పి రోజు కాయలను కోసుకోవచ్చు. కాయల సైజ్ ప్రకారం ధరలు ఉంటాయి. 18.5ఎంఎం ధర రూ.29, 25ఎంఎం రూ.15, 33ఎంఎంకు రూ.5 చొప్పున ఉంటుంది. కాయ సైజ్ పెరిగితే ధర తక్కువ ఉంటుంది. కాయలు మొదలైనప్పటి నుంచి సుమారు 15 నుంచి 20 సార్లు కోయొచ్చు. ఏడాదిలో నాలుగు సార్లు ఈ పంట సాగుకు అవకాశం ఉంది.

కంపెనీదే బాధ్యత..

ఎల్కతుర్తిలో కీరదోస విత్తనాలను 'గ్లోబల్ గ్రీన్ జహీరాబాద్' అనే పేరుగల కంపెనీ అందించింది. విత్తనాలు వేసినప్పటి నుంచి కాయలను తరలించే వరకూ వారిదే బాధ్యత. రైతు కేవలం పంట బాగోగులు, నీళ్లు పెట్టడం, కూలీ ఖర్చులు చూసుకోవాల్సి ఉంటుంది. ఏవైనా చీడపీడలు ఆశిస్తే వాటి నివారణ చర్యలకు కంపెనీ ఎప్పటికప్పుడు తగు సూచనలు, సలహాలు అందిస్తుంది. కంపెనీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం పంట దిగుబడిని లెక్కకట్టి రైతులకు డబ్బులు అందిస్తారు. రెండు నెలల్లోపే పంట కోసం పడిన శ్రమకు తగిన ఫలితం దక్కుతుందని రైతులు చెబుతున్నారు. ఆరోగ్య ప్రదాయినిగా నిలిచే ఈ కీరదోసను తినేందుకు, మందుల ఉపయోగపడుతుందని కంపెనీ ప్రతినిధులు తెలుపుతున్నారు. ఈ కాయలను రైతుల వద్ద నుంచి జహీరాబాద్‌కు తరలిస్తారు. అక్కడి నుంచి యూఎస్‌ఏ, గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తారు.

ఈ ఏడాది మండల కేంద్రంలో సుమారు నలుగురు రైతులు ఐదెకరాల్లో కీరదోస పంట సాగు చేశారు. వీరంతా ఇంతకు ముందు వరి, మొక్కజొన్న, మిరప, పత్తి పంటలు సాగు చేసేవారు. ఈ ఏడాది తమ సాగులో మార్పు చేయాలని ఆలోచించి కీరదోస పంట గురించి తెలుసుకున్నారు. అందులో ఉన్న లాభనష్టాలను బేరీజు వేసుకుని పంట వేశారు. రెండు నెలల్లోనే ఆదాయం చూపించే కీరదోస పంటకు ఇక్కడి నేలలు అనుకూలంగా ఉండడంతో వారు ఆశించిన స్థాయిలో ఎదిగాయి. ప్రస్తుతం నీటి వసతులు సరిపడా ఉండడంతో పంట రెండు నెలల్లోనే చేతికొచ్చేసింది. పంట వేసిన 30 రోజుల్లో కాత వస్తుంది. మరో 30 రోజులు కాయలను కోసుకునేందుకు వీలు ఉంటుంది.

ఆసక్తి చూపుతున్న రైతులు..

తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడిని ఇచ్చే కీరదోస సాగుపై రైతులు ఇప్పుడిప్పుడే ఆసక్తి చూపుతున్నారు. సిద్దిపేట, గజ్వేల్ క్లస్టర్ పరిధిలో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, వేలేరు, హుజూరాబాద్, హుస్నాబాద్, నంగూర్, ఎల్లారెడ్డి, మండలాల్లోని రైతులు సాగు చేస్తున్నారు. ఎలాంటి రిస్క్ లేకపోవడంతో ఈ పంట సాగుపై మరి కొందరు రైతులు కూడా ఆసక్తి చూపుతున్నారని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

శ్రమ తక్కువ.. ఆదాయం ఎక్కువ



కీరదోస పంట సాగులో శ్రమ తక్కువ ఉంటుంది. చీడపీడల బెడద తక్కువ. రెండు నెలల్లోనే ఆదాయం కనిపిస్తుంది. తోటి రైతులు సాగు గురించి అడిగి తెలుసుకుంటున్నారు. ఈ పంటలో ఇప్పటి వరకు నష్టం లేదు.

- అల్లి వనమ్మ, మహిళా రైతు ఎల్కతుర్తి

నీటి వినియోగం తక్కువ



నేను ఎకరం భూమిలో కీరదోస పంట సాగు చేశా. ఇతర పంటలకు ఎకరానికి సరిపడే నీళ్లతో కీరదోసకు మూడెకరాలకు పారించుకోవచ్చు. దోస తీగలను రక్షించుకుంటే పంట చేతికందినట్లే. నేను గతంలో ఈ పంట సాగుచేశా. మళ్లీ చేస్తున్నాను. రూ. 35వేలు విత్తనాల ఖర్చుపోగా సంవత్సరానికి రూ. 70వేలు ఆదాయం సమకూరుతుంది. మొదటి క్రాప్ చేతికి రాగా అమ్మితే రూ. 5వేలు వచ్చాయి. - డి.రమేశ్, రైతు ఎల్కతుర్తి

రుణ పరిమితి ప్రతిపాదనలు ఖరారు

- పెరిగిన సాగు ఖర్చుల మేరకు రుణాలు
- జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ ఆమోదం



సాంకేతిక కమిటీ సమావేశంలో అధికారులు

హన్మకొండ: వ్యవసాయానికి బ్యాంకులు అందించే పంట రుణ పరిమితి ప్రతిపాదనలను ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ రూపొందించింది. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సాంకేతిక కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో రోజురోజుకూ పెరుగుతున్న సాగు వ్యయం మేరకు అధికారులు, రైతు ప్రతినిధులు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంటల వారీగా అయ్యే సాగు ఖర్చులపై చర్చించి 2025-2026 సంవత్సరానికి రుణ పరిమితి ప్రతిపాదనలు రూపొందించారు. ఈ ప్రతిపాదనలు రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీకి పంపనున్నట్లు వరంగల్ డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్ తెలిపారు. సమావేశంలో డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, హనుమకొండ ఏడీఏ లక్ష్మీనారాయణ, ఉమ్మడి జిల్లాల ఎల్‌ఎండీలు రాజు, జయప్రకాశ్, తిరుపతి, హరిబాబు, డీసీసీబీ డీజీఎం అశోక్, ఏజీఎం మధు, మేనేజర్ ఆశ్రిత, ఉమ్మడి జిల్లా హార్టికల్చర్, మార్క్‌ఫెడ్, బ్యాంకు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పంటల వారీగా రుణ పరిమితి (ఎకరాకు రూ.లలో)..

పంట	గత ఏడాది		2025-2026కు	
	కనిష్టం	గరిష్టం	కనిష్టం	గరిష్టం
వరి	43,000	45,000	45,000	47,000
జొన్న	17,000	19,000	17,000	19,000
మొక్కజొన్న	32,000	34,000	34,000	36,000
మిల్లెట్స్	15,000	17,000	15,000	17,000
పెసర	20,000	22,000	20,000	22,000
కంది	19,000	21,000	19,000	21,000
మినుములు	15,000	17,000	15,000	17,000
శనగ	24,000	26,000	24,000	26,000
వేరుశనగ	28,000	30,000	31,000	34,000
నువ్వు	19,000	21,000	19,000	21,000
పొద్దు తిరుగుడు	27,000	29,000	27,000	29,000
ఆముదం	17,000	19,000	19,000	17,000
ఆయిల్ పాం	42,000	44,000	48,000	50,000
మిరప	82,000	84,000	90,000	92,000
పత్తి	44,000	46,000	48,000	50,000
పసుపు	85,000	87,000	88,000	90,000
అరటి	45,000	47,000	47,000	49,000
అరటి టిష్యూ	95,000	97,000	98,000	1,0,0000
కూరగాయలు	35,000	37,000	37,000	39,000
కూరగాయలు (ఆర్గానిక్)	65,000	67,000	67,000	69,000
ఫ్లోరీకల్చర్	36,000	38,000	38,000	40,000
బొప్పాయి	65,000	67,000	68,000	70,000
నిమ్మ	48,000	50,000	48,000	50,000
సపోటా	34,000	36,000	34,000	36,000
మామిడి	42,000	44,000	45,000	48,000
జామ	45,000	47,000	48,000	50,000
ఆపిల్‌బేర్	33,000	35,000	38,000	40,000
డ్రాగన్‌ఫ్రూట్	78,000	80,000	78,000	80,000
పొగాకు	----	----	40,000	42,000

పతంగుల షాపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పతంగుల షాపుపై టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం దాడులు చేసి రూ.38,290 విలువైన నిషేధిత చైనా మాంజాను సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఎల్‌బీనగర్‌కు చెందిన ఎండీ.అజీజ్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మాంజా వ్యాపారి అరెస్ట్

వరంగల్ క్రైం: చైనా మాంజా అమ్మకాలు చేపడుతున్న వ్యాపారిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. కుమార్‌పల్లి మార్కెట్‌లో మహ్మద్ సాజిద్‌ను అదుపులోకి తీసుకుని అతడి నుంచి రూ.6,250 విలువ గల మాంజాను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

బైపాస్‌ను రద్దు చేయండి..

- మంత్రి పొంగులేటికి రైతుల వినతి



వరంగల్: బడాబాబుల మేలు కోసం 'కుడా' మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించిన ఐఆర్‌ఆర్ బైపాస్ తమ జీవనాధారమైన పంట పొలాల నుంచి వెళ్తోందని, ఈ రోడ్డును రద్దు చేయాలని పైడిపల్లి, ఆరెపల్లి బైపాస్ రోడ్డు బాధిత రైతులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్‌లో జరిగిన ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సుల ప్రారంభ కార్యక్రమానికి హాజరైన మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు నేతలు, వ్యాపారులకు మేలు జరిపేందుకు తమ పంట పొలాల మీదుగా కొత్తపేట క్రాస్ వరకు అశాస్త్రీయంగా రోడ్డును ప్రతిపాదించారని తెలిపారు. ఇప్పటికే జాతీయ రహదారి కింద తమ గ్రామ రైతుల భూములు పోయాయని, మళ్లీ బైపాస్, ఓఆర్‌ఆర్ కోసం తమ జీవనాధారమైన పంట పొలాలను కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించి పేదలు, రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సుంకరి ప్రశాంత్, బుద్దె గణేశ్, రావుల రామేందర్‌రెడ్డి, బుద్దె కృష్ణమూర్తి, బుద్దె సురేశ్, ఇట్నేని క్రాంతి, కమలాపురం జితేందర్, అచ్చ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు దారి మళ్లించిన ఎంపీడీఓ

- బొమ్మకల్లు జీపీ నిధులు రూ.1.10 లక్షలు పక్కదారి

తొర్రూరు/పెద్దవంగర: మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం బొమ్మకల్లు గ్రామ పంచాయతీకి సంబంధించిన రూ.1.10 లక్షల ఈజీఎస్ నిధులను తొర్రూరు ఎంపీడీఓ దారి మళ్లించారు. ఆ నిధులు గ్రామ పంచాయతీ ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయాల్సి ఉండగా తొర్రూరు ఎంపీడీఓ సీహెచ్. నర్సింగరావు తన సొంత ఖాతాకు మళ్లించుకున్నారు. ఈ నెల 3న ఎంపీడీఓ.. తొర్రూరు ఎస్‌బీఐ మేనేజర్‌ను కలిసి తన ఖాతాలోకి ఆ నిధులు ట్రాన్స్‌ఫర్ అయ్యేలా స్పెసిమెన్ సిగ్నేచర్ అప్‌లోడ్ చేయించుకున్నాడు. ఈ నెల 4న తన సొంత ఖాతాకు బొమ్మకల్లు జీపీ ఈజీఎస్ నిధులను ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారి సంతకాలు లేకుండా, పెద్దవంగర ఎంపీడీఓ అనుమతి లేకుండా ఆ నిధులతో సంబంధం లేని తొర్రూరు ఎంపీడీఓ సదరు నిధులను దారి మళ్లించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై బొమ్మకల్లు పంచాయతీ కార్యదర్శి సురేందర్.. పెద్దవంగర ఎంపీడీఓ వేణుమాధవ్‌కు ఫిర్యాదు చేశారు. తొర్రూరు ఎంపీడీఓ నిధులను దారిమళ్లించడంపై పెద్దవంగర ఎంపీడీఓ కలెక్టర్, డీపీఓ, జెడ్పీ సీఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై దుమారం రేగగా ఆ నిధులు బొమ్మకల్లు జీపీ ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయడం కొసమెరుపు. ఈ ఘటనపై తొర్రూరు ఎంపీడీఓను వివరణ కోరగా.. సమగ్ర కుటుంబ సర్వే నిధులు రావాల్సి ఉందని, ఆ నేపథ్యంలోనే ఈ నిధులు తీసుకున్నట్లు తెలిపారు.

రామప్ప అభివృద్ధి పనులు

త్వరితగతిన పూర్తిచేయాలి

- పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ స్మితా సబర్వాల్



ప్రసాద్ స్కీమ్‌లో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

వెంకటాపురం(ఎం): రామప్పలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ స్మితా సబర్వాల్ ఆదేశించారు. సోమవారం ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలం రామప్ప ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టీఎస్ స్వాగతం పలకగా.. పూజారులు పూర్ణకుంభంతో ఆలయంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్మితాసబర్వాల్.. రామలింగేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిధిలో జరుగుతున్న ఇంటర్ ప్రిటేషన్ సెంటర్, షాపింగ్ కాంప్లెక్స్ పనులు పరిశీలించి హరిత కాటేజీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యాటకుల సౌకర్యార్థం ప్రసాద్ స్కీమ్‌లో భాగంగా రూ. 60 కోట్లు, సాస్కి స్కీమ్‌లో భాగంగా రూ.73 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. రామప్పకు వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆలయ కల్యాణ మండపం (కామేశ్వరాలయం) పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పర్యాటకులకు అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్‌తో పాటు టూరిజం ఎండీకి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, జనరల్ మేనేజర్ సత్యనారాయణమూర్తి, హెరిటేజ్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ లక్ష్మి, కేంద్ర పురా వస్తుశాఖ అధికారులు హెచ్‌ఆర్ దేశాయ్, డిప్యూటీ సూపరింటెండెంట్ రోహిణి పాండే, అసిస్టెంట్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, వరంగల్ సర్కిల్ ఇన్‌చార్జ్ రాములు నాయక్, డిప్యూటీ డైరెక్టర్ మల్లునాయక్, ఆర్డీఓ వెంకటేశ్, ఇంజనీర్ డీఈ ధనరాజ్, టూరిజం అధికారి సూర్యకిరణ్ పాల్గొన్నారు.

ఓపెన్ కాస్టు గనితో రామప్పకు ముప్పు

వెంకటాపురం శివారులో సింగరేణి సంస్థ చేపట్టే ఓపెన్ కాస్ట్ గనితో యునెస్కో గుర్తింపు పొందిన 810 ఏళ్ల చరిత్ర కలిగిన రామప్ప ఆలయానికి ముప్పు పొంచి ఉందని రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆకిరెడ్డి రామ్మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు సోమవారం రామప్ప ఆలయానికి వచ్చిన టూరిజం ప్రిన్సిపాల్ సెక్రటరీ స్మిత సభర్వాల్‌కు ఓపెన్ కాస్టు గనిని నిలిపివేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

బ్లాక్ బెర్రీ అద్భుతంగా ఉంది

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండలంలోని మొండ్యాల తోగు సమీపంలో అభివృద్ధి చేసిన బ్లాక్ బెర్రీ దీవి అద్భుతంగా ఉందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ అన్నారు. సోమవారం రాత్రి ఆమె.. కలెక్టర్ టీఎస్.దివాకర, పర్యాటక అభివృద్ధి సంస్థ తెలంగాణ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డితో కలిసి బ్లాకబెర్రీ దీవిని సందర్శించారు. ప్రకృతిని ఆస్వాదిస్తూ పర్యాటకులకు ఆహ్లాదం, ఆకర్షించే విధంగా బ్లాక్ బెర్రీ ఐలాండ్‌లో ఏర్పాట్లు చేశారని కలెక్టర్‌ను అభినందించారు.

వేసవి ప్రణాళిక పనులు పూర్తి చేయాలి

- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: వేసవిలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా రూపొందించిన ప్రణాళికల మేరకు పనులను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవిలో విద్యుత్ డిమాండ్ మేరకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ అత్యవసర సర్వీస్‌లో భాగమైన హాస్పిటల్స్, ఇతర సర్వీస్‌లకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించేందుకు ఇంటర్ లింకింగ్ లైన్ల వ్యవస్థను పటిష్టపరచాలని సూచించారు. అవసరమైనచోట పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాలన్నారు. నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్ల పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. వేసవిలో ఎలాంటి అంతరాయాలు లేకుండా నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, టి.మధుసూదన్, వి.తిరుపతి రెడ్డి, సీఈలు రాజుచౌహాన్, బీకం సింగ్, జీఎంలు నాగప్రసాద్, గౌతమ్ రెడ్డి, శ్రీనివాస్, వాసుదేవ్, ఎస్‌ఈ (సివిల్)అంకుశ్, డి.ఈ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సంక్షేమానికి కృషి

- టీజీఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి శ్రీరాంనాయక్



నూతన కమిటీని అభినందిస్తున్న రాష్ట్ర నాయకులు

హన్మకొండ : విద్యుత్ గిరిజన ఉద్యోగుల సంక్షేమానికి ఎన్పీడీసీఎల్ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కృషి చేస్తుందని ఆ అసోసియేషన్ కార్యదర్శి అజ్మీరా శ్రీరాం నాయక్ అన్నారు. సోమవారం హనుమకొండ శ్యామల దుర్గాదాస్ కాలనీలోని శ్యామల గార్డెన్‌లో ఎన్పీడీసీఎల్ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల నుంచి ఎస్టీ విద్యుత్ ఉద్యోగులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో శ్రీరాం నాయక్ మాట్లాడుతూ గిరిజన ఉద్యోగులకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలు తెలుసుకుంటూ వాటిని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఉద్యోగులు ఏమైనా సమస్య లుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఎన్పీడీసీఎల్ కంపెనీ స్థాయి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా భూక్యా వాలునాయక్, అధ్యక్షుడిగా జాటోత్ హర్జీ, కార్యదర్శిగా అజ్మీరా శ్రీరాంనాయక్ ఎన్నికయ్యారు. శ్రీరాం నాయక్ వరుసగా పదోసారి కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో ఎన్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ సదర్‌లాల్, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మాలోత్ రాంజీ నాయక్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, ఎన్పీడీసీఎల్ అధ్యక్ష, కార్యదర్శులు నెహ్రూనాయక్, ఫకీరానాయక్, అన్ని జిల్లాల, డివిజన్ల అధ్యక్ష కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పంట చేను కాపలా ప్రాణం తీసింది..

- విద్యుదాఘాతంతో కూలి మృతి



వెంకన్న(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : పంట చేను కాపలా కోసం వెళ్లిన ఓ కూలి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ మండలంలోని మొట్లతండా గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నూకల వెంకన్న దగ్గర వర్రె ఉప్పలయ్య, సింగరయబోయిన రమేశ్ దగ్గర బాదావత్ చంద్రు వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకున్నారు. ఉప్పలయ్య, చంద్రు వేరుశనగ, బొబ్బెర పంటలు సాగుచేస్తున్నారు. ఈ క్రమంలో అడవి పందులు, నక్కలు, కోతుల బెడదతో సాయంత్రం వరకూ పంట చేనుల వద్ద కాపలా ఉంటున్నారు. రాత్రి సమయంలో ఇద్దరి పంటల మధ్య లో విద్యుత్ తీగను అమర్చి వెళ్తున్నారు. రోజూ ఉదయం రాగానే ఆ విద్యుత్ తీగను తొలగించి మళ్లీ కాపలా ఉంటున్నారు. కొద్దిరోజుల క్రితం ఉప్పలయ్య కుమారుడు మహేశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన కుమారుడి వద్ద ఉంటున్నాడు. చంద్రు స్థానికంగా చిట్టీ పాట ఉండడంతో ఉప్పలయ్యకు సడ్డకుడైన చెన్నబోయిన వెంకన్న (55) పంట చేన్ల వద్ద కాపలా ఉండమని కోరాడు. దీంతో వెంకన్న ఆదివారం పంట చేన్ల వద్దకు వెళ్లి కోతులను కర్రతో కొట్టే క్రమంలో అక్కడే ఉన్న విద్యుత్ తీగకు తగిలి మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలికి చేరుకుని వెంకన్న మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సంతోశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై వి.దీపిక సోమవారం తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్..

- వ్యక్తి దుర్మరణం



సేవియా(ఫైల్)

కురవి: ట్రాక్టర్.. బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి కురవి మండలంలోని నేరడ శివారు చీమ్లాతండా-బంగ్యా తండా మధ్య తట్టుపల్లి రహదారిపై జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నేరడ శివారు చీమ్లా తండా గ్రామానికి చెందిన ధరావత్ సేవియా(42) రాయినిపట్నం వద్ద చికెన్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బైక్‌పై బంగ్యా తండాలోని తన బావ ఇంటికి వెళ్లాడు. అనంతరం రాయినిపట్నంలోని తన ఇంటికి వస్తున్నాడు. బంగ్యా తండాకు చెందిన ట్రాక్టర్ కురవి నుంచి బంగ్యా తండాకు వస్తోంది. డ్రైవర్ ట్రాక్టర్‌కు లైట్లు వేయకుండా వస్తున్నాడు. ఈ క్రమంలో తట్టుపల్లి వద్ద ట్రాక్టర్ ఎదురుగా బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న సేవియా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ భూక్య వస్రాం పరారయ్యాడు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు కుమారులు సన్నీ, బన్నీ ఉన్నారు. రోడ్డు ప్రమాద విషయం తెలియగానే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

చిన్నబోయినపల్లిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మరో వ్యక్తి..



పోతరాజు(ఫైల్)

ఏటూరునాగారం: హైదరాబాద్‌లో ఉంటున్న ఓ భవన నిర్మాణ కార్మికుడు ఇందిరమ్మ ఇంటి సర్వే కోసం వచ్చి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి పెట్రోల్ బంక్ వద్ద జరిగింది. కన్నాయిగూడెం మండల కేంద్రానికి చెందిన కొంచర్ల పోతరాజు(46) ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామానికి వెళ్లి కన్నాయిగూడెం వెళ్తున్నాడు. ఈ క్రమంలో చిన్నబోయినపల్లి పెట్రోల్ బంక్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కన్నాయిగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై సమాచారం ఇవ్వగా పోతరాజు స్వగ్రామం వచ్చాడు. సర్వే అనంతరం కొండాయిలో తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తాజొద్దీన్ తెలిపారు.